క్లుప్తంగా...

విద్యుత్ బిల్లులు సకాలంలో చెల్లించండి

కీసర: వినియోగదారులు విద్యుత్ బిల్లులను సకాలంలో చెల్లించి విద్యుత్ సంస్థకు సహకరించాలని కీసర మండల విద్యుత్ ఏఈ మురళీకృష్ణ తెలిపారు. కీసర, రాంపల్లి విద్యుత్ ఉపకేంద్రం పరిధిలో దాదాపు రూ.2 కోట్ల మేర బకాయిలు ఉన్నాయన్నారు. గ్రామాల్లో బిల్లుల వసూళ్లకు వచ్చే సంస్థ సిబ్బందికి సహకరించాలని కోరారు. ఆయా తేదీల్లో గ్రామాల్లో ఏర్పాటు చేసే కేంద్రాల్లో బిల్లులు చెల్లించేందుకు వీలుకాని వినియోగదారులు నేరుగా తమ ఫోన్లలో ఫోన్‌పే, ఆన్‌లైన్ ద్వారా బిల్లులు చెల్లించాలని సూచించారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత



మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీకి చెందిన వేణుగోపాల్‌కు సీఎంఆర్‌ఎఫ్ కింద మంజూరైన రూ.లక్ష చెక్కును మంగళవారం మున్సిపల్ కమిషనర్ రాములు అందజేశారు. మాజీ సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి, కౌన్సిలర్లు జైపాల్‌రెడ్డి, దొడ్ల మల్లిఖార్జున్ ముదిరాజ్, వీణాసురేందర్, బాల్‌రాజ్, హేమంత్‌రెడ్డి ఉన్నారు.

ఘట్‌కేసర్: సీఎం సహాయ నిధి చెక్కును 3వ వార్డు కౌన్సిలర్ సంగీతప్రభాకర్‌రెడ్డి లబ్ధిదారులకి మంగళవారం అందజేశారు. మూడో వార్డుకు చెందిన కిష్టమ్మ అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొందగా ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి ఆమెకు రూ.లక్ష మంజూరయ్యాయి. ఈ సందర్భంగా చెక్కును ఆమెకు అందజేశారు. మాజీ సర్పంచ్ వెంకటేశ్‌ముదిరాజ్, మాజీ వార్డు సభ్యుడు జంగారెడ్డి, ఎఫ్‌ఎస్‌సీఎస్ మాజీ డైరెక్టర్ ప్రభాకర్‌రెడ్డి, జైపాల్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి ఉన్నారు.

వరద ముంపు సమస్యలను పరిష్కరించాలి



కీసర: నాగారం మున్సిపల్ కమిషనర్ రాజేంద్రకుమార్‌ను మంగళవారం నాగారం వరద బాధిత కాలనీల జేఏసీ కమిటీ సభ్యులు కలిశారు. మున్సిపల్ పరిధిలో 22 కాలనీల్లో వర్షాకాలంలో వరద ముంపుతో తాము ఇబ్బందులు పడుతున్నామని, క్షేత్రస్థాయిలో పర్యటించి సమస్యలను తెలుసుకోవాలని కమిషనర్‌ను కోరారు. సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు తమ వద్ద ఉన్న డాక్యుమెంటేషన్స్‌ను కమిషనర్‌కు అందజేశారు. ఈమేరకు చర్యలు చేపట్టాలని వినతి పత్రం అందజేశారు. జయకుమార్, కమలాకర్ తదితరులు పాల్గొన్నారు.

హైమాస్ట్ లైట్లకు మరమ్మతులు



ఘట్‌కేసర్: పట్టణంలోని మాధవరెడ్డి రైల్వే వంతెనపై ఉన్న హైమాస్ట్ లైట్లకు మున్సిపల్ చైర్‌పర్సన్ పావనీజంగయ్య, స్థానిక కౌన్సిలర్ శశికళదేవేందర్‌తో కలిసి మంగళవారం మరమ్మతులు చేయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాత్రి సమయంలో వాహనదారులకు ఇబ్బందులు తలెత్తకుండా, వంతెనపై ప్రమాదాలు జరగకుండా మరమ్మతులు చేయించామన్నారు. మాజీ వార్డు సభ్యుడు దేవేందర్ ముదిరాజ్ పాల్గొన్నారు.

ఈవీఎం మెషిన్‌పై అవగాహన

బోడుప్పల్: బోడుప్పల్ మున్సిపల్ నగర కార్యాలయంలో నూతన ఓటర్లకు ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషన్ (ఈవీఎం) ద్వారా ఓటు ఎలా వినియోగించుకోవాలి అనే దానిపై మంగళవారం మాక్ పోలింగ్ నిర్వహించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మేడిపల్లి డిప్యూటీ తహసీల్దార్ రాధిక, జూనియర్ అసిస్టెంట్ వనిత, మేయర్ సామల బుచ్చిరెడ్డి, కమిషనర్ వేణుగోపాల్‌రెడ్డి, కార్పొరేటర్లు చీరాల నరసింహ, మేనేజర్ మంజులత, అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కాప్రాలో కుప్పకూలిన చెట్టు

కాప్రా: సైనిక్‌పురి హెచ్‌ఎంటీ కాలనీ వద్ద చెట్ల కొమ్మలు పెద్ద ఎత్తున విరిగి పడ్డాయి. రోడ్డుకు అడ్డంగా పడటంతో ఆ మార్గంలో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. సమాచారం తెలుసుకున్న స్థానిక కార్పొరేటర్ స్వర్ణరాజ్ శివమణి ఘటనా స్థలానికి వెళ్లి సంబంధిత అధికారులకు సమాచారం అందించారు. తక్షణమే స్పందించిన సిబ్బంది చెట్టును తొలగించి రాకపోకలను పునరుద్ధరించారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కార్పొరేటర్ స్వర్ణరాజ్ సూచించారు.

నిండు కుండల్లా చెరువులు



అలుగులు పోస్తున్న మేడ్చల్ పెద్ద చెరువు



నీటితో కళకళలాడుతున్న పెద్ద చెరువు

ఇటీవల కురుస్తున్న భారీ వర్షాలతో గ్రామాలు, పట్టణాల్లో చెరువులు జలకళను సంతరించుకున్నాయి. వారం రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో అన్ని చెరువులు, కుంటలు పూర్తిగా నిండాయి. మేడ్చల్ పెద్ద చెరువు ఇప్పటికే పూర్తిగా నిండింది. మండలంలోని పెద్ద చెరువులైన డబీల్‌పూర్, అత్వెల్లి, రావల్‌కోల్, పూడూర్, మేడ్చల్ తుమ్మ చెరువు, ఇతర గ్రామాల్లోని కుంటలు, చెరువులు పూర్తిగా నిండాయి. – మేడ్చల్



నిండిన మేడ్చల్ తుమ్మ చెరువు

నిధులు మంజూరు చేయాలని సీఎం కేసీఆర్‌కు వినతి

మేడ్చల్: మండలంలోని గ్రామాల అభివృద్ధికి ప్రత్యేకంగా నిధులు కేటాయించాలని కోరుతూ సీఎం కేసీఆర్‌ను మండల జెడ్పీటీసీ శైలజారెడ్డి, శ్రీరంగవరం సర్పంచ్, జిల్లా సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు విజయానంద్‌రెడ్డి కలిసి విన్నవించారు. దంపతులిద్దరూ ప్రగతి భవన్‌కు మంత్రి మల్లారెడ్డితో కలిసి వెళ్లి సీఎంను కలిశారు. మండల అభివృద్ధికి మరిన్ని నిధులు కావాలని కోరినట్లు తెలిపారు. నిధులు మంజూరు చేసేందుకు హామీ ఇచ్చారని తెలిపారు.



సీఎం కేసీఆర్‌తో జెడ్పీటీసీ దంపతులు

ఎన్నికల కమిషన్ ఆదేశాలు అమలు

వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ అమయ్ కుమార్

సాక్షి, మేడ్చల్‌జిల్లా: రాష్ట్ర ఎన్నికల కమిషన్ నిబంధనలు, సూచనలను ఖచ్చితంగా పాటించేలా అన్ని జాగ్రత్తలు తీసుకోవడంతో పాటు సంబంధిత అధికారులను అప్రమత్తం చేస్తామని జిల్లా కలెక్టర్ అమయ్ కుమార్ అన్నారు. మంగళవారం రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వికాస్‌రాజ్‌తో ఆయన వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. మేడ్చల్ జిల్లాలో ఇంటింటి సర్వేలో వచ్చిన దరఖాస్తులతో సహా ఆన్‌లైన్ ద్వారా ఫారం 6, ఫారం 7, ఫారం 8 కింద వచ్చిన దరఖాస్తులను పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటున్నామని, బుధవారం వరకు అన్ని పూర్తి చేస్తామని కలెక్టర్ తెలిపారు. ఎన్నికల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చేపట్టాల్సిన చర్యలపై ముందస్తు సమావేశాలను నిర్వహించామన్నారు.



కలెక్టరేట్లో ఓటర్లకు ఓటుపై అవగాహనతో పాటు ఈవీఎం, వీవీప్యాట్స్ సంబంధించిన వివరాలను తెలియజేస్తామన్నారు. మొబైల్ వ్యాన్ల ద్వారా కూడా ఓటు వేసే విధానం, ఓటు హక్కుపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి హరిప్రియ, కీసర ఆర్డీవో రాజేష్‌కుమార్, ఎన్నికల రిటర్నింగ్ అధికారులు పాల్గొన్నారు.

షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించాలని సీఎంకు వినతి

పోచారం: హౌసింగ్ బోర్డు ఏర్పాటు చేసిన సంస్కృతి టౌన్‌షిప్‌లో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించి కాలనీ వాసులకు అందుబాటులోకి తేవాలని సీఎం కేసీఆర్‌ను స్థానిక కౌన్సిలర్ బెజ్జంకి హరిప్రసాదరావు కోరారు. టౌన్‌షిప్‌వాసులకు హౌసింగ్ బోర్డు కల్పించాల్సిన వసతుల గురించి చెప్పారు. అందులో భాగంగానే షాపింగ్ కాంప్లెక్స్, కమ్యూనిటీ హాల్ ఏర్పాటు చేయాలని కోరారు. దీంతో సీఎం సానుకూలంగా స్పందించారు. అనంతరం గృహ నిర్మాణ శాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డిని కలిసి



షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణ ప్రతిపాదనలను వేగవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.

పెండింగ్ బిల్లులు మంజూరు చేయాలి

పీఆర్‌టీయూ మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు వై.రామేశ్వర్‌గౌడ్

కీసర: ప్రభుత్వం పెండింగ్ బిల్లులను వెంటనే మంజూరు చేయాలని పీఆర్‌టీయూ టీఎస్ మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు వై.రామేశ్వర్‌గౌడ్ అన్నారు. మంగళవారం నాగారం ప్రభుత్వ పాఠశాలలో పీఆర్‌టీయూటీఎస్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయుల సంక్షేమం కోసం ఎల్లప్పుడూ పాటుపడే సంఘం పీఆర్‌టీయూటీఎస్ మాత్రమే అన్నారు. పీఆర్‌టీయూటీఎస్ కీసర మండల అధ్యక్షుడు పాండురంగవిఠల్, ప్రధాన కార్యదర్శి చీర యాదగిరి, రాష్ట్ర బాధ్యులు వెంకటేశం, శ్రీనివాస్, కృష్ణసాగర్‌రెడ్డి, జిల్లా బాధ్యులు రజినీకాంత్‌రెడ్డి, శ్రీనివాస్, వెంకట్రామిరెడ్డి, రాజేష్, వెంకటేష్, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుకు మరమ్మతులు చేయించిన ట్రాఫిక్ పోలీసులు



రోడ్డుకు మరమ్మతులు చేయిస్తున్న ట్రాఫిక్ సీఐ హనుమాన్‌గౌడ్

మేడ్చల్‌రూరల్: మండల పరిధిలోని రేకులబావి నుంచి సోమారం మీదుగా ములుగు మండలానికి వెళ్లే రోడ్డులో సోమారం చెరువు కట్ట వద్ద ఆర్‌అండ్‌బీ రోడ్డులో ఏర్పడిన భారీ గుంతలను మంగళవారం మేడ్చల్ ట్రాఫిక్ సీఐ హనుమాన్‌గౌడ్, ఎస్‌ఐ లింగం, సిబ్బంది మరమ్మతులు చేయించారు. రోడ్డులో ఏర్పడిన గుంతల కారణంగా ద్విచక్ర వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారని, ప్రమాదాలకు గురవుతున్నారని, బద్రీనాథ్ ఆలయానికి వెళ్లే భక్తులకు ఇబ్బందులు కలుగుతున్నాయని ఇటీవల బీసీ విద్యార్థి సంఘం కేంద్ర కమిటీ అధ్యక్షులు గోదా అరుణ్‌యాదవ్ ట్రాఫిక్ పోలీసులకు విన్నవించారు. ఈ మేరకు సీఐ హనుమాన్‌గౌడ్ పర్యవేక్షణలో మంగళవారం ట్రాఫిక్ పోలీసులు సోమారం గ్రామ నాయకులు నర్సింహ, గ్రామస్తుల సహకారంతో రోడ్డు మరమ్మతుల పనులు చేపట్టారు.

గురుకుల పాఠశాలలో ఉచిత వైద్య శిబిరం



విద్యార్థులకు పరీక్షలు చేస్తున్న వైద్యులు

మేడ్చల్: కిష్టాపూర్‌లోని సాంఘిక సంక్షేమ శాఖ గురుకుల పాఠశాలలో మంగళవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. కండ్లకోయలోని సీఎంఆర్ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించి విద్యార్థులకు ఉచితంగా పరీక్షలు చేశారు. అవసరమైన వారికి మందులు అందజేశారు. శిబిరంలో ఆసుపత్రి వైద్యులు, కౌన్సిలర్ గణేష్, ప్రిన్సిపాల్ శైలజ పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన విద్య, భోజనం అందించాలి

మేడ్చల్: ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు నాణ్యమైన విద్య, రుచికరమైన భోజనం అందించాలని రాష్ట్ర సర్పంచ్‌ల ఫోరం అధికార ప్రతినిధి గౌడవెల్లి సర్పంచ్ సురేందర్‌ముదిరాజ్ అన్నారు. గౌడవెల్లిలోని ప్రభుత్వ పాఠశాలను సందర్శించి వసతులను పరిశీలించారు. విద్యార్థులకు అర్థమయ్యే విధంగా పాఠాలు బోధించాలని ఉపాధ్యాయులను కోరారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని ఆయన పరిశీలించారు. విద్యార్థులకు ఎలాంటి సమస్యలున్నా తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ పెంటమ్మ, వార్డు సభ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న సర్పంచ్, తదితరులు

అక్షయ పాత్ర సేవలు భేష్

మేడ్చల్‌రూరల్: ఇస్కాన్ సంస్థ వారి అక్షయ పాత్ర సేవలు ఎంతో ప్రశంసనీయమైనవని గుండ్లపోచంపల్లి మున్సిపల్ వైస్ చైర్మన్ ప్రభాకర్ అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని కండ్లకోయ గ్రామంలో ఉన్న ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు అక్షయ పాత్ర వారు అందిస్తున్న అల్పాహారం కార్యక్రమాన్ని మంగళవారం ప్రారంభించారు. సంస్థ ప్రతినిధులు శివరామరాజు, రఘురాం, పీఏసీఎస్ వైస్ చైర్మన్ నరహరి, నాయకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పౌష్టికాహారం పంపిణీ..

మేడ్చల్: మున్సిపాలిటీ పరిధిలోని అత్వెల్లి 3వ వార్డు అంగన్‌వాడీ కేంద్రంలో కౌన్సిలర్ జాకట దేవరాజు పౌష్టికాహారం అందజేశారు. గర్భిణులు, బాలింతలకు గుడ్లు, ఇతర పౌష్టికాహారం అందజేశారు.

వరద కష్టాలకు చెక్ పెట్టేందుకు..



నాగారంలో నాలా పనులను పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్ చంద్రారెడ్డి

కీసర: నాగారం మున్సిపాలిటీలో వరద కష్టాలకు చెక్ పెట్టేందుకు హెచ్‌ఎండీఏ మంజూరు చేసిన రూ.8 కోట్ల నిధులతో చేపట్టిన బాక్స్ డ్రైన్ పనులను మంగళవారం మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి, స్థానిక కౌన్సిలర్ అన్నంరాజు లావణ్యశ్రీనివాస్ తదితరులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దమ్మాయిగూడ చెరువు నుంచి చెర్లపల్లి చెరువు వరకు వరద సాఫీగా వెళ్లేందుకు మంత్రి మల్లారెడ్డి ఆదేశాలతో ఇరిగేషన్ అధికారులు, హెచ్‌ఎండీఏ మంజూరు చేసిన నిధులతో బాక్స్ నాలా పనులు చేపట్టినట్లు తెలిపారు. మొదటగా చర్లపల్లి చెరువు నుంచి మోడీ అపార్ట్‌మెంట్ వరకు పనులు చేపట్టినట్లు చెప్పారు. మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ రాంరెడ్డి పాల్గొన్నారు.

అనారోగ్యంతో మహిళ మృతి

కీసర: దమ్మాయిగూడ మున్సిపల్ పరిధిలోని అహ్మద్‌గూడ ఆర్‌జీకే కాలనీలో ఒంటరిగా నివాసం ఉంటూ మృతి చెందిన ఓ మహిళ మృతదేహాన్ని మంగళవారం కీసర పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కీసర పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం దమ్మాయిగూడ మున్సిపల్ పరిధిలోని అహ్మద్‌గూడ ఆర్‌జీకే కాలనీలో ఎస్.సోని(43) ఒంటరిగా ఉంటోంది. మంగళవారం ఇంటి నుంచి దుర్వాసన రావడంతో పక్కింటి వారు పోలీసులకు సమాచారం అందించారు. ఈమేరకు మృతదేహాన్ని స్వాధీనం చేసుకొని పోస్టుమార్టమ్ నిమిత్తం గాంధీ మార్చురీకి తరలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. అనారోగ్యంతో మృతి చెంది ఉండొచ్చని భావిస్తున్నారు. ఆమె బంధువులు ఎవరైనా ఉంటే ఫోన్: 8712662191, 8712579090.

పడకేసిన పారిశుద్ధ్యం

- నగరం, శివారు ప్రాంతాల్లో తప్పని ఇక్కట్లు
- కార్మికుల సమ్మెతో పల్లెల్లో మరింత అధ్వానం
- ఎక్కడపడితే అక్కడ చెత్తా చెదారం
- డ్రైనేజీల పరిస్థితి అత్యంత దుర్భరం
- ముంచుకొచ్చే రోగాల భయం భయం



సాక్షి, మేడ్చల్ జిల్లా: అయిదారు రోజులుగాభారీ వర్షాలు కురుస్తున్నాయి. వర్షాలకు నగర శివారుల్లోని పలు పురపాలక సంఘాలు, గ్రామ పంచాయతీల్లోని లోతట్టు ప్రాంతాలు, కాలనీల్లో వరద నీరు నిల్వ ఉంటోంది. అలాగే.. శివారులోని మేడ్చల్–మల్కాజిగిరి, రంగారెడ్డి జిల్లాల పరిధిలోని 619 పంచాయతీల్లో 20 రోజులుగా పారిశుద్ధ్య కార్మికులు సమ్మె చేస్తుండటంతో.. శానిటేషన్ సమస్య జటిలంగా మారుతోంది. ఈ నేపథ్యంలో పలు పల్లెలతో పాటు పురపాలక సంఘాల్లో పారిశుద్ధ్యం పడకేసింది. శివారు జిల్లాల పరిధిలో 29 పురపాలక సంఘాలు ఉండగా, ఒక్కో పురపాలక సంఘంలో ప్రతిరోజూ 80 నుంచి 100 టన్నుల చెత్త ఉత్పత్తి అవుతోంది. మురుగు కాల్వలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయకపోవటంతో పరిసర ప్రాంతాలు అస్తవ్యస్తంగా మారుతున్నాయి. కనీసం బ్లీచింగ్ పౌడర్ చల్లుతున్న దాఖలాలు లేవని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. దోమలను అరికట్టేందుకు పురపాలక సంఘాలు, గ్రామపంచాయతీల్లోని ఫాగింగ్ యంత్రాలను సరిగ్గా వినియోగించడం లేదని తెలుస్తోంది. దోమల బెడదతో ప్రజలకు డెంగీ, మలేరియా, టైఫాయిడ్, చికున్‌గున్యా తదితర వ్యాధులు ప్రబలే అవకాశముంది.

బాలిక పట్ల అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తిపై కేసు

కీసర: మాయమాటలు చెప్పి ఓ బాలిక పట్ల అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తిపై కీసర పోలీసులు కేసు నమోదు చేశారు. కీసర సీఐ వెంకటయ్య వివరాల ప్రకారం చీర్యాల గ్రామానికి చెందిన బి.ఆనంద్(42) గ్రామంలో మెడికల్ షాప్ నిర్వహిస్తున్నాడు. అదే గ్రామానికి చెందిన మైనర్ బాలికతో అసభ్యకరంగా ప్రవర్తించడంతో బాధితురాలి కుటుంబ సభ్యులు 100 డయల్ ద్వారా పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు అతడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విరివిగా పండ్ల తోటల పెంపకం చేపట్టాలి



ప్రతాపసింగారంలో మాట్లాడుతున్న ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి

ఘట్‌కేసర్: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనులతో విరివిగా పండ్ల తోటల పెంపకం చేపట్టాలని ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి అన్నారు. ప్రతాపసింగారం రైతు వేదికలో సర్పంచ్ శివశంకర్ అధ్యక్షతన కేంద్ర ప్రభుత్వ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా ఉద్యానవన– వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో 12 రకాల పండ్ల తోటల పెంపకంపై మంగళవారం అవగాహన కల్పించారు. ఎంపీపీ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ రైతులకు 100 శాతం, చిన్న, సన్నకారు రైతులకు 90 శాతం సబ్సిడీతో 5 ఎకరాల వరకు డ్రిప్ సౌకర్యం లభిస్తుందన్నారు. మండల వ్యవసాయాధికారి బాసిత్ మాట్లాడుతూ పండ్ల తోటలు పెంపకంపై ఆసక్తి గల రైతులు రైతులు వేదిక, గ్రామ పంచాయతీ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎఫ్‌ఎస్‌సీఎస్ వైస్ చైర్మన్ అనంతరెడ్డి, రైతు బంధు సమితి మండల కో ఆర్డినేటర్ అంజిరెడ్డి, సర్పంచ్ శివశంకర్, ఏఈఓ జగదీశ్, అనంతరెడ్డి, రైతులు పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలం కబ్జా కాకుండా చర్యలు తీసుకోండి

కీసర: దమ్మాయిగూడ మున్సిపల్ పరిధిలోని హరిదాస్‌పల్లి గ్రామ రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 50లోని ఎకరం ప్రభుత్వ స్థలాన్ని కొందరు వ్యక్తులు కబ్జా చేసేందుకు యత్నిస్తున్నారని, సదరు ప్రభుత్వ స్థలాన్ని కాపాడాలని కోరుతూ మంగళవారం హరిదాస్‌పల్లి గ్రామస్తులు తహసీల్దార్ గౌరీవత్సలకు వినతి పత్రం అందజేశారు. గతంలో రెవెన్యూ అధికారులు ప్రభుత్వ స్థలాన్ని సర్వే చేసి హద్దురాళ్లు ఏర్పాటు చేసి ప్రభుత్వ భూమిగా బోర్డు ఏర్పాటు చేశారని గ్రామస్తులు తెలిపారు. కొన్నిరోజులుగా నగరానికి చెందిన ఓ వ్యక్తి చీర్యాల గ్రామ రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 253 భూమిని కొనుగోలు చేసి హరిదాస్‌పల్లి గ్రామరెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 50లోని ప్రభుత్వ స్థలాన్ని కూడా అన్యాక్రాంతం చేసేందుకు యత్నిస్తున్నాడని, ప్రభుత్వ స్థలాన్ని కాపాడాలని కోరారు. స్థలాన్ని సర్వే చేయించి హద్దులు ఏర్పాటు చేసి ప్రభుత్వ స్థలాన్ని పరిరక్షించేందుకు చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు.



తహసీల్దార్ గౌరివత్సలకు వినతిపత్రం అందజేస్తున్న హరిదాస్‌పల్లి గ్రామస్తులు

యమ్నంపేట్‌లో రోడ్లకు మరమ్మతులు



రోడ్లకు మర్మతులు చేయిస్తున్న కౌన్సిలర్ రాజశేఖర్

పోచారం: మున్సిపాలిటీ పరిధిలోని యమ్నంపేట్‌లో వర్షాలకు దెబ్బతిన్న రోడ్లకు స్థానిక కౌన్సిలర్ చింతల రాజశేఖర్ మంగళవారం మరమ్మతులు చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 3వ వార్డులోని గ్లోబల్ ఎన్‌క్లేవ్‌లో రోడ్లపై నీరు నిల్వడంతో మరమ్మతులు చేపట్టామన్నారు. కాలనీ అసోసియేషన్ అధ్యక్షుడు రామకృష్ణ, ప్రధాన కార్యదర్శి రవీందర్, కాలనీవాసులు సంతోష్, వెంకటేశ్, కల్యాణ్, గిరిధర్ తదితరులు ఉన్నారు.

విద్యార్థులకు బస్‌పాస్‌ల అందజేత



దేవరయాంజాల్ జెడ్పీ పాఠశాలలో బస్‌పాస్‌లను అందజేస్తున్న ఆర్టీసీ అధికారులు

శామీర్‌పేట్: హకీంపేట ఆర్టీసీ డిపో ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు బస్‌పాస్‌లను మంళవారం అందజేశారు. హకీంపేట డిపో మేనేజర్ భవభూతి ఆధ్వర్యంలో తూముకుంట మున్సిపాలిటీలోని దేవరయాంజాల్ జెడ్పీ ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు ఉచితంగా బస్‌పాస్‌లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు స్వరూపరాణి, డిపో అసిస్టెంట్ మేనేజర్ రాజశేఖర్, కౌన్సిలర్ నర్సింగరావుగౌడ్, పలువరు స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

చోరీలకు పాల్పడుతున్న అంతర్రాష్ట్ర ముఠా అరెస్టు



కీసర పోలీసులు అరెస్టు చేసిన అంతర్రాష్ట్ర ముఠా సభ్యులు

కీసర: తాళాలు వేసి ఉన్న ఇళ్లలో చోరీలకు పాల్పడుతున్న ఐదుగురు అంతర్రాష్ట్ర ముఠా సభ్యులను కీసర పోలీసులు పట్టుకున్నారు. కీసర సీఐ వెంకటయ్య తెలిపిన వివరాల ప్రకారం ఉత్తర్‌ప్రదేశ్ రాష్ట్రం సంబర్ జిల్లాకు చెందిన హాసిన్(44), రాంభరోస్(28), సమీన్(55), షకీల్(35), రవీంద్రపాల్‌గౌతమ్(28) కొన్ని రోజుల క్రితం ఉత్తర్‌ప్రదేశ్ నుంచి వచ్చి సికింద్రాబాద్ చుట్టుపక్కల రైల్వే స్టేషన్లలో ఆశ్రయం పొందారు. సికింద్రాబాద్ మార్కెట్‌లో కొన్ని ఇనుప వస్తువులు కొనుగోలు చేసి శివార్లలో తాళాలు వేసి ఉన్న ఇళ్ల తాళాలు పగలగొట్టి చోరీలకు పాల్పడుతున్నారు. రాంపల్లి చౌరస్తాలో పోలీసులు వారిని పట్టుకొని విచారించారు. 15.6 తులాల బంగారు ఆభరణాలు, 29 తులాల వెండి ఆభరణాలు స్వాధీనం చేసుకున్నారు. ఐదుగురిని మంగళవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

సాధ్యమైనంత త్వరలో రోడ్లు వేస్తాం

వరంగల్ రహదారిని పరిశీలించిన బృందం

ఉప్పల్: భారీ వర్షాలకు ఛిద్రమైన ఉప్పల్–వరంగల్ జాతీయ రహదారిని మంగళవారం ఆర్‌అండ్‌బీ అధికారులు, గాయిత్రి కన్‌స్ట్రక్షన్స్ ప్రతినిధులు, ఉప్పల్ ట్రాఫిక్ పోలీసుల బృందం మంగళవారం పరిశీలించింది. ఉప్పల్ చౌరస్తా నుంచి నారాపల్లి వరకు రోడ్డును దాదాపు ఏడు కిలో మీటర్లమేర పరిశీలించారు. వర్షాలు తగ్గుముఖం పట్టగానే రోడ్లకు మర్మతులు చేయనున్నట్లు ఆర్‌అండ్‌బీ ఈఈ ధర్మారెడ్డి తెలిపారు. సాధ్యమైనంత త్వరలో రోడ్లను వేస్తామని తెలిపారు. రాచకొండ ట్రాఫిక్ డీసీపీ అవినాష్ మహంతి, మల్కాజిగిరి ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాస్‌రావు, ఉప్పల్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ నాగుల అశోక్, ఘట్‌కేసర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ఉన్నారు.



ఉప్పల్-వరంగల్ రోడ్డును పరిశీలిస్తున్న అధికారులు